

ధన్నూర్(బీ)లో క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## క్రీడల్లో గెలుపోటములు సహజం

**బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్**

బోథ్, జనవరి 11 : క్రీడాపోటీల్లో గెలుపోటములు సహజమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం పొచ్చెర, ధన్నూర్(బీ) గ్రామాల్లో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువకులు క్రికెట్‌ను క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు. గెలిస్తే గర్వం, ఓడితే నిరాశ పడకూడదన్నారు. కాసేపు యువకులతో కలిసి క్రికెట్ ఆడి ఉత్సహ పరిచారు. అంతకుముందు ఎమ్మెల్యేను ఆయా గ్రామాల్లో యువకులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ ఎంపీపీలు తుల శ్రీనివాస్, రాథోడ్ సజన్, శ్రీధర్‌రెడ్డి, బాపురెడ్డి, జగన్‌రెడ్డి, జాదవ్ గణేశ్, జె.శ్రీధర్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, ప్రశాంత్, స్వామి, రాజు, రమణ, సీతయ్య, ప్రతాప్ పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**- డీటీవో శ్రీనివాస్**

జైనథ్, జనవరి 11 : ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ అధికారి శివపల్లి శ్రీనివాస్ అన్నారు. 2025 జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా శనివారం మండలంలోని భోరజ్ ప్రభుత్వ ఉమ్మడి చెక్‌పోస్టు తనిఖీ కార్యాలయ ఆవరణలో వివిధ వాహనదారులకు అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలను నడపరాదని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు విద్యాధర్‌రెడ్డి, మార్గం రవీందర్, ఏఎంవీఐలు ప్రీతంరెడ్డి, లంక హనుమంతు పాల్గొన్నారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న డీటీవో శ్రీనివాస్



బ్యాటింగ్ చేస్తున్న నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల

## క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయి

**నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల**

ఖానాపూర్ టౌన్, జనవరి 11 : క్రీడలు మానసికోల్లాసానికి, శరీరక దారుఢ్యానికి దోహదపడతాయని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. శనివారం ఖానాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మూడో సేషన్ ఖానాపూర్ క్రికెట్ ప్రీమియర్ లీగ్( కేపీఎల్-3) క్రీడా పోటీలను ఎస్పీ ప్రారంభించారు. క్రీడల్లో గెలుపు-ఓటములు సహజమని, క్రీడలతో స్నేహభావం పెంపొందించుకోవాలని సూచించారు. క్రీడల్లో ద్వేషాలు ఉండకూడదన్నారు. కుల, మతాలకతీతంగా క్రికెట్ పోటీలు నిర్వహించడంపై నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుని వారికి పోలీసుశాఖ ఆధ్వర్యంలో క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాజేశ్ మీనా, సీఐ సైదరావు, ఎస్ఐ గైక్వాడ్ రాహుల్, తోట సుమిత్, మట్టేరి రాజశేఖర్, అంకం మహేందర్, కైసర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలి

నిర్మల్ అర్బన్, జనవరి 11 : నిర్మల్ పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీ జానకి షర్మిల పోలీసు అధికారులకు సూచించారు. నిర్మల్‌లో ట్రాఫిక్ నియంత్రణ చర్యల్లో భాగంగా శనివారం కొత్త బస్టాండ్, ట్యాంక్ బండ్, పాత బస్టాండ్, మయూరి హోటల్ సర్కిల్ ప్రాంతాల్లో ఏఎస్పీ రాజేశ్ మీనాతో పర్యటించారు. ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని పట్టణ సీఐ ప్రవీణ్‌కు సూచించారు. రోడ్లకు ఇరుపక్కల తోపుడు బండ్లు లేకుండా చర్యలు తీసుకోవాలని, బస్టాండ్ ఎదురుగా ఆటోలు నిలపకుండా చూడాలన్నారు. ఆర్టీసీ కాంప్లెక్సులకు ఎదురుగా ఉన్న దుకాణాలను తీసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.



ట్రాఫిక్ నియంత్రణ చర్యలను పర్యవేక్షిస్తున్న ఎస్పీ జానకి షర్మిల

జైనథ్ మండలంలోని బోరజ్ వద్ద జాతీయ రహదారిపై నిర్వహించిన ఆందోళనలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న



- మాజీ మంత్రి జోగు రామన్న
- ఆందోళన ఉద్రిక్తం
- ఇరువర్గాల మధ్య తోపులాట

# రైతు భరోసా ఇవ్వాల్సిందే..

**కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం రూ.15 వేలు ఇవ్వాలి..**

ఆదిలాబాద్, జనవరి 11(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులు, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న సూచించారు. రైతు భరోసాను వెంటనే అమలు చేయాలని, ప్రతి రైతుకు ఎకరాకు రూ.15 వేలు అందించాలని డిమాండ్ చేస్తూ శనివారం జైనథ్ మండలంలోని భోరజ్ వద్ద జాతీయ రహదారిపై రామన్న ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్లకార్డుల ద్వారా ప్రదర్శించారు. ధర్నాను పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఆందోళన చేస్తుంటే.. ఎందుకు అడ్డుకుంటున్నారని మాజీ మంత్రి జోగు రామన్న పోలీసులను ప్రశ్నించారు.

**రైతులను మోసం చేసిన కాంగ్రెస్**

రైతు భరోసా పథకంలో భాగంగా ప్రతి రైతులకు ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని ప్రకటించిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు ఎకరాకు కేవలం రూ.12 వేలు ఇస్తామని ప్రకటించడం మోసం చేయడమన్నారు. ఇప్పటికే విడుతలుగా రైతు భరోసా ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు పలు షరతులు విధిస్తూ పథకం అమలు చేస్తామని చెప్పడం హస్యాస్పదమన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ విషయంలో రైతులకు మొండిచేయి చూపిన కాంగ్రెస్ రైతు భరోసా విషయంలో మరోసారి రైతులకు అన్యాయం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలప్పుడు ఆరు గ్యారెంటీలతోపాటు 420 హామీలను ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని నెరవేర్చడంలో విఫలమైందని మండిపడ్డారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏడాది గడిచినా హామీకి దిక్కులేదన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించాలని డిమాండ్ చేశారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ ఆందోళనలు చేస్తూంటే ప్రభుత్వం పోలీసులపై ఒత్తిడి తీసుకొచ్చి అరెస్టులు చేయిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు యాసం నర్సింగరావు, విజ్జిగిరి నారాయణ, మార్సెట్టి గోవర్ధన్, లింగారెడ్డి, గణేశ్ యాదవ్, విజయ్, చందాల రాజన్న, వెంకట్ రెడ్డి, సతీశ్, రాంరెడ్డి, భోజన్న, పురుషోత్తం, దేవన్న, గంగన్న, కస్తాల ప్రేమల, స్వరూపరాణి, పర్వీన్, కరుణ, ప్రశాంత్ పాల్గొన్నారు.




ప్లకార్డుతో నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

### కాంగ్రెస్ రైతులకు చేసిందేమి లేదు..



రైతు ప్రభుత్వమని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేసిందేమి లేదు. నాకు మూడు ఎకరాల భూమి ఉంది. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన రైతుబంధుతో ఇబ్బందులు లేకుండా రెండు పంటలు వేశా. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి అర్హులకు మొండిచేయి చూపింది. ఇప్పుడు రైతుభరోసా ఎకరాకు రూ.12 అంటున్నారు. అందరూ రైతులకు రైతు భరోసా ఇవ్వాలి.

*-భూమారెడ్డి, రైతు, ఆనంద్‌పూర్, జైనథ్*

### ఎకరాకు రూ. 15 వేలు ఇవ్వాలి..



నాకు ఐదెకరాల భూమి ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సి వచ్చింది. తెలంగాణ వచ్చినంక కేసీఆర్ రైతుబంధు ఇవ్వడంలో రైతుల కష్టాలు దూరమయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అన్ని చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోవడం లేదు. రైతు భరోసాలో ఎకరాకు రూ. 15 వేల పంట పెట్టుబడి ఇస్తామని అన్నారు. ఇప్పటికే రెండు పంటలకు ఇవ్వలేదు. ఇప్పుడు ఎకరాకు రూ.12 వేలు అంటున్నారు. ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రూ. 15 వేలు ఇవ్వాలి.

*- జిట్ట అశోక్, రైతు, ఆడ, జైనథ్ మండలం*



పోలీసులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న



బట్టగూడలో ఝరికి పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు

## వడగాంకు చేరుకున్న పాదయాత్ర

ఇంద్రవెల్లి, జనవరి 11 : నాగోబా దేవతకు జనవరి 28న మహాపూజకు మెస్రం వంశీయులు ఉపయోగించే గంగాజల సేకరణ కోసం ఈ నెల 10న సాయంత్రం కేస్లాపూర్ గ్రామంలో మెస్రం వంశీయుల పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ పటేల్ ఆధ్వర్యంలో పాదయాత్ర ప్రారంభమైంది. ఈ పాదయాత్ర వడగాం గ్రామానికి శనివారం సాయంత్రం చేరుకున్నది. కేస్లాపూర్ నుంచి పాదయాత్రగా బయలుదేరిన మెస్రం వంశీయులు మండలంలోని బట్టగూడ గ్రామ పొలిమేరలో గంగాజలం సేకరించే ఝరితో శుక్రవారం రాత్రి అక్కడే బసచేసిన విషయం తెలిసిందే. బట్టగూడ గ్రామస్తులతోపాటు మెస్రం వంశీయులు గంగాజలం సేకరించే ఝరికి పురుషులు, మహిళలు వేర్వేరుగా సంప్రదాయ ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు.
మెస్రం వంశీయులకు గ్రామస్తుల ఆధ్వర్యంలో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. భోజనాల అనంతరం మెస్రం వంశీయులు మండలంలోని బట్టగూడ నుంచి మండలంలోని వడగాం గ్రామానికి బయల్దేరి వెళ్లారు. గ్రామానికి చేరుకున్న మెస్రం వంశీయుల పాదయాత్రకు గ్రామస్తుల ఆధ్వర్యంలో గిరిజన సంప్రదాయ ప్రకారం గ్రామ పొలిమేరలో ఘనంగా స్వాగతం పలికారు. గ్రామపొలిమేరలో రాత్రి బస చేసిన మెస్రం వంశీయులకు గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

## డార్ఫ్ ఆశయాలను సాధించాలి

- అధికారులు, ప్రజాప్రతినిధుల పిలుపు
- మార్లవాయిలో ఘనంగా 38వ వర్ధంతి

జైనూర్, జనవరి 11 : ఆదివాసుల ఆత్మబంధువు, మానవ పరిణామ శాస్త్రవేత్త బెట్టి ఎలిజబెత్ హైమన్ డార్ఫ్ దంపతుల ఆశయాలను సాధించాలని అధికా రులు, ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. శనివారం జైనూర్ మండలం మార్ల వాయిలో డార్ఫ్ దంపతుల 38వ వర్ధంతికి ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఎస్పీ శ్రీనివాస్‌రావు, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అదనపు ఎస్పీ సన్‌ప్రీత్ హాజరయ్యారు. ఆదివాసులు గ్రామ పటేల్ ఆత్రం మానిక్‌రావ్ ఇంటి నుంచి సంప్రదాయ వాయిధ్యాల నడుమ మంగళహారతులతో తరలివచ్చి సమాధుల వద్ద పూజలు చేశారు. డార్ఫ్ దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి సేవలను కొనియాడారు. మార్లవాయి మాజీ సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్, డీడీ రమాదేవి, ఏపీవో మెస్రం మనోహర్, డీఎస్పీ కరుణాకర్, సీఐ రమేశ్, ఎస్ఐలు సాగర్, రామకృష్ణ, ఏటీడీవో శ్రీనివాస్, ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్, డైరెక్టర్ కొడప హన్మూ పటేల్, మాజీ వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, సర్పంచుల సంఘం మాజీ మండల అధ్యక్షుడు మడవి భీంరావ్, ఎంపీటీసీల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు కుమ్ర భగవంత్‌రావ్, మాజీ ఎంపీపీ కుమ్ర తిరుమల విశ్వనాథ్, కొడప ప్రకాశ్, బీఆర్ఎస్ సిర్పూర్(యూ) మండల అధ్యక్షుడు తోడసం ధర్మరావ్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ బీర్‌షావ్, ఏపీవో నగేశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సొంబాయి, డార్ఫ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.



డార్ఫ్ దంపతుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న ఆసిఫాబాద్ కలెక్టర్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి

## చైనా మాంజా వినియోగిస్తే చట్టరీత్యా నేరం

- ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి
- పలు దుకాణాల్లో తనిఖీ
- రూ.50వేలు విలువ చేసే చైనా మాంజా స్వాధీనం

ఎదులాపురం,జనవరి 11 : ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజా వినియోగిస్తే చట్టరీత్యా నేరమని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. శనివారం ఆదిలాబాద్‌లో చైనా మాంజాను విక్రయిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు ఆదిలాబాద్ వన్ టౌన్, టూ టౌన్ సీఐలు, సిబ్బంది సహకారంతో పలు దుకాణాల్లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ అశోక్ రోడ్డులోని లక్ష్మి సీజనల్ షాప్ నందు ఓనర్ శ్రీనివాస్ వద్ద రూ.50వేల విలువ చేసే నిషేధిత చైనా మాంజా లభ్యమైంది. శ్రీనివాస్‌పై వన్‌టౌన్‌లో కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. దుకాణాల యజమానులకు వర్తక వ్యాపారులకు నిషేధిత చైనా మాంజాను విక్రయించినట్లయితే వారిపై నూతన చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజా జీవన విధానానికి, పశువులకు ఆపదను కలిగించే చైనా మాంజా వినియోగం ప్రమాదకరమని తెలిపారు. పట్టణ సీఐ సునీల్, రెండవ పట్టణ సీఐ కరుణాకర్, సిబ్బంది పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న చైనా మాంజాను మీడియాకు చూపిస్తున్న డీఎస్పీ జీవన్ రెడ్డి, సీఐలు

## ఎంసీహెచ్‌లో వ్యాక్సిన్ల కొరత..!

మంచిర్యాల అర్బన్, జనవరి 11 : జిల్లా కేంద్రంలోని కాలేజ్‌రోడ్డులోగల మాతా శిశు సంరక్షణ కేంద్రంలో (ఎంసీహెచ్) వ్యాక్సిన్ల కొరత ఏర్పడింది. శనివారం చంటిపిల్లలతో వచ్చిన తల్లిదండ్రులకు వ్యాక్సిన్లు లేవని, మరో వారం తర్వాత రావాలని అక్కడున్న సిబ్బంది తెలపడంతో వెనుదిరిగారు. సర్కారు దవాఖానల్లో సరిపడా మందులు అందుబాటులో ఉంచకుంటే ఎలాగని వారు అసహనం వ్యక్తం చేశారు. ఇక ఈ విషయమై జిల్లా వ్యాక్సినేషన్ అధికారిణి డా.అనితను వివరణ కోరగా ప్రస్తుతానికి నెలన్నర సమయంలో వేసే ఐపీవీ, పెంట వ్యాక్సిన్ల కొరత ఉందని, హైదరాబాద్ నుంచి ఒకటీ రెండు రోజుల్లో వస్తాయని తెలిపారు. వ్యాక్సిన్ల కోసం ఎంసీహెచ్‌కు రాకుండా అందుబాటులో ఉన్న పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలకు వెళ్లాలని సూచించారు. పీహెచ్‌సీల్లో అన్ని వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

## అధ్యాపకుడిపై వేధింపుల కేసు

నిర్మల్ అర్బన్, జనవరి 11 : నిర్మల్ పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో పని చేస్తున్న అధ్యాపకుడు విద్యార్థినిని వేధించిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిర్మల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాధితురాలు తన ఇంటర్మీడియెట్ చదివే రోజుల్లో సదరు లెక్చరర్ చరణ్‌దాస్ ఫోన్, మెస్సేజ్‌లు చేస్తూ వేధించేవాడు. ప్రస్తుతం తాను హైదరాబాద్‌లో చదువుతున్నప్పటికీ లెక్చరర్ వేధిస్తున్నాడని నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నిర్మల్ రూరల్ ఎస్సై లింబాద్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## అధికారికంగా వడ్డే ఓబన్న జయంతి

ఎదులాపురం, జనవరి 11 : చరిత్రను నేటి తరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో వడ్డే ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ అభివృద్ధి అధికారి కె.రాజాలిం గు తెలిపారు. ప్రథమ స్వాతంత్ర్య పో రాటంగా పరిగణించే సిపాయిల తిరుగుబాటుకు(1857) ముందే 1846లో ఉయ్యాలవాడ నరసింహారెడ్డితో కలిసి ఓబన్న ఆంగ్లేయులతో వీరోచితంగా పోరాడారని గుర్తు చేశారు. ఆయన జ యంతి సందర్భంగా ఆ మహనీయుని వీరగాథను స్మరించుకుందామన్నారు. ఏఎస్‌డబ్ల్యూవో సునీత, సంక్షేమ వసతి గృహాల అధికారులు ఓం ప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**వడ్డే ఓబన్న జయంతి వేడుకలు**

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 11: నిర్మల్ కలెక్టరేట్‌లో శనివారం వడ్డే ఓబన్న జయంతి వేడుకలు నిర్వహించారు. అధికారులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సంపంగి ప్రభాకర్ మాట్లాడుతూ పీడిత వర్గాల హక్కుల కొరకు పోరాడిన గొప్ప వ్యక్తి ఓబన్న అని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి శ్రీనివాస్, సహాయ వెనుకబడిన తరగతుల అధికారి సత్యనారాయణరెడ్డి, కార్యాలయ పర్యవేక్షకుడు ఖాలిక్, అధికార సిబ్బంది పాల్గొన్నారు.



నిర్మల్ చైన్‌గేట్ : వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధికారులు



ఎదులాపురం : నివాళులర్పిస్తున్న అధికారులు